# 1 పన్నాగం

శంకరయ్యకు తిక్కరేగిపోయిందంటే ఆశ్చర్యంలేదు.

తొమ్మిదేళ్ళనుంచీ ఏకఛత్రాధిపత్యంగా పంచాయతీబోర్డు ప్రెసిడెంట్ గిరీ వెలిగిస్తూ, గ్రామంలోకల్లా పెద్ద మనిషిని పేరుబడి ఐశ్వర్యవంతుల్లో ఒకడై ఉండి, అనేక తగూలు కోర్టుదాకా వెళ్ళకుండానే తీర్పులు చెప్పి, ఆచరింపజేస్తూ, అధికారాన్ని అన్ని దిక్కులా విస్తరింపజేస్తూ-యీ నాటికి తనకు సమానుడనబడే రంగారావుతో పోటీబడి విజయం తనదేనని నిశ్చయంగా నమ్మలేని దారుణపరిస్థితుల్లో బడితే తిక్కరేగక మరేం అవుతుందీ?

అధికారం చేతులోఉన్నదనే గర్వం, హుందాతనం, గొప్పలతో తనకు తెలియకుండానే అల్ప సంఖ్యాకుల అభిమానాన్నీ, అధిక సంఖ్యాకుల ఆగ్రహాన్నీ మూటగట్టుకోవటం జరిగిపోయిందని సూచనగా తెలుస్తూనే ఉన్నది. పదవీ వ్యామోహంలో పడిపోయిన తను యీనాడు దాన్ని వొదులుకోవటమంటే-కష్టించి సాధించిన అమూల్యాన్ని ధారపోయటమే అవుతుంది, తనకు అలవడిన అగ్రస్థానాధిపత్యం ఇది; రుచి మరిగిన వాడు తాను. రంగారావు-నిన్నగాక మొన్న కాలేజినుంచి వచ్చి యీనాడు యీ గ్రామాన్నేదో ఉద్ధరించి సంఘసేవా, దేశసేవా చేద్దామని బద్ధకంకణుడైనట్లు డంబాలు కొడుతూంటే తనకు హాస్యాస్పదంగానే ఉన్నది.

తనకన్న ప్రతిభ చూపగలడు యీ రంగారావు అని పొరబడేవారు, అధికారం అతని చేతికి అందిన అల్పకాలంలోనే తమ తప్పు తెలుసుకొని తీరుతారు. ఈ గ్రామాన్ని హరిహరాదులు కూడా తీర్చి దిద్దలేరనే నగ్నసత్యం తనకూ. మిగతా మెంబర్లకే గాక, తన పార్టీ నాయకులకూ్కడా తెలుసు. కాని పార్టీ పతనంచెందకుండా కాపాడవలసిన బాధ్యతలు తమ తలలమీద ఉండటంవల్ల ప్రతి పంచవర్ష ప్రణాళికలోనూ తాము సాధించిన

దాన్ని గోరంతలు కొండంతలు చేస్తూ ప్రజాదరణకు పాకులాడుతూనే ఉన్నారు. అంతకన్న ఏమేమో చేస్తామనటం చెల్లించలేని వాగ్దానాలు మాత్రమే! ప్రతిరాజకీయ పార్టీ వేసే మామూలు ఎత్తే ఇది! ఈ రహస్యాన్ని బైట పెట్టేందుకుమాత్రం ఏ రాజకీయవేత్తా ఒప్పడు; ఎందుకంటే తను దూరవలసింది కూడా అదే గుడారం! దాన్ని తగలబెట్టుకుంటే ప్రతిపక్షితో పాటు తనకూ పట్టుకొమ్మ తప్పతుంది!

ఈ ఎన్నికలలో తన ఓటమి బారెడు దూరంలోకి వచ్చిందేమోననే భయం పట్టుకున్నది. ఏదెలా ఉన్నా కట్టకడపటి రాజీగా తనతోపాటు ఆ రంగారావు కూడా ఓడిపోతే కొంతలో కొంత నయం. ఐతే తాను బలహీను డౌతున్నకొద్దీ రంగారావు బలవంతు డౌతూండటమే పరమ శోచనీయం!

ఈ బోడి అధికారం లేకుంటే మాత్రం నిజానికి తనకు వచ్చిపడే లోటేమిటి? తనను తాను ఆ విధంగా సంబాళించుకోవచ్చు. ఐతే ఇక్కడ పట్టుదలా, తన ఓటమిని ఒప్పుకోలేని అశక్తతా, అవమానానికి తోడు గాయ పడటం మొదలైన ప్రముఖ సమస్యలు తనకు ఊపిరాడకుండా చేస్తున్నవి.

రంగారావును సాధించే ఎత్తులు వేయటంలోనే శంకరయ్య మనస్సు లగ్నమై, ఆ లక్ష్యాన్నే చూస్తూ ఆలోచనలు సాగించింది. ఇది అంత తేలిగ్గా విడివడే ముడి కా దనీ, పీటముడిగా రూపొంది, ప్రస్తుత కాలానికి బ్రహ్మ ముడిగా కూడా తయారైందనే విషయం సుస్పష్టం. తన పార్టీవాళ్ళే ఏదైనా మార్గం చూడవలసి ఉన్నది.

శంకరయ్య ఆలోచనలు తెగకుండానే ఆయన కుడిభుజమైన లక్ష్మయ్య రానే వచ్చాడు. లక్ష్మయ్య ముఖ కవళికల్ని చూస్తూనే తాను తలచిన దానికన్న అశుభవార్తల్ని మోసుకొచ్చాడనే భయం శంకరయ్యను పీడించింది.

"లాభంలేదు శంకరయ్య బావా! ఆ రంగారావు కొరకరాని కొయ్యగా తయారయ్యాడు. అతను మాత్రం ఏం చేస్తాడులే-పక్కనున్న గ్రహాలు పడనియ్యటం లేదు!" అన్నాడు లక్ష్మయ్య.

"అంటే ఐదువేలకూడా తన నామినేషన్ ఉపసంహరించుకో దలచలే దన్నమాట!"

"వేలు వేలంటావు కాని-అతనికి మాత్రం వేలు తక్కువాయేం? ఎలక్షన్స్‌లో పదివేలు ఖర్చయినా దీని అంతేదో కనుక్కోవాలనే పట్టుదల ఉన్నట్లు విప్పి చెప్పాడు!"

"పది వేలే!" అని ఆశ్చర్యాన్ని ప్రకటించాడు శంకరయ్య. "కిందటి యెలక్షన్‌లో ఖర్చయిన నాలుగువేలూ రాబట్టుకునేందుకు యెంత గడ్డి కర వాల్సి వచ్చిందో నాకు తెలుసు-నా ఆంతరంగికుడివైన నీకు తెలుసు! పంచా యితీబోర్డు ప్రెసిడెంట్ తన హయాంలో పదివేలు-అదీ వెధవ ఎలక్షన్‌కు ఖర్చుచేసింది మాత్రమే రాబట్టుకోవటం యీ శతాబ్దంలో యీ దేశంలో సాధ్యం కాదని తెలియంది ఒక్క రంగారావుకే! పిల్లకాకికేం తెలుసు, ఉండేలు దెబ్బ!"

"నిజమే ననుకో.... మరి మనం అంత సొమ్ము ఖర్చుచేయ గలమా?"

"అసంభవం!" అన్నాడు శంకరయ్య ఉచ్ఛస్థాయిలో!

"పోనీలే బావా! ఆ అధికారమేదో వాడినే వెలగబెట్టనీరాదూ?"

పుండుమీద కారం చల్లినట్లుంది-ఆ మాటలు వింటూంటే!

"ఈ శంకరయ్యను జయించటం అంత తేలికనుకున్నాడేమో!"

"కష్టమైనా, పట్టుదలతో సాధిస్తాడనే అనుకోవాలి మరి"

"దేశ పరిపాలనను వెలగబెట్టే పార్టీకి నా ఓటమి యెంత అవమాన కరం!" అన్నాడు శంకరయ్య స్వగతంలో వలె వినబడీ వినబడనట్లు.

"ఏమో-నాయకులు అలా అనుకోక పోవచ్చు. ఎలక్షన్స్‌లో ప్రయో గించబడే నానా రకాల ఎత్తులూ, మోసాలూ రంగారావు పార్టీవాళ్ళు యీ సారి అనుసరించేందుకు ఎలాటి సందేహమూ లేదనే ధోరణిలో ఉన్నారు."

"అది తెలుస్తోందిగా - పదివేల ఖర్చుకు సిద్ధంగా ఉన్నారంటివి.... యీ పదివేలూ ఖర్చయే మార్గాలు ఎంత వక్రించి ఉంటవో గ్రహించలేనా?"

"మాలగూడెంలో ఎలక్షన్ అయ్యేవరకూ ప్రతి ఓటరుకూ రోజుకు రెండేసి కాపుసారా ముంతలు సప్లయ్యట!"

"ఆఁ!" అని తన ఆశ్చర్యాన్ని-ప్రకటించాడు శంకరయ్య: "మద్య పాన నిషేధం అమల్లో ఉండగానే ఇంత దారుణమా! రాజకీయాల మాట

యెలా ఉన్నా, ముందు పూజ్య బాపూజీ ఆత్మ యెంత ఘోషిస్తుందో!.... వెంటనే పోలీసు బలగాలకు ఆహ్వానం పంపుతే?''

"అదిమాత్రం ఏమంత సురక్షితమైన మార్గంలే బావా! ఎటూ ఏనాది, ఎరుకల గూడాల్లో మనమూ కాపుసారా వడ్డిస్తూనే ఉంటిమాయె! అన్నిటికన్నా ముఖ్యం కాపుసారా కాచి అమ్ముకునే గుత్తవ్యాపారంలో అధికభాగం మన పార్టీ వాళ్ళదే కదా! పోలీసులు దాడులు జరుపుతే మన ఓటర్లలో చాలామంది జైలుకు వెళ్ళటమో, జరిమానాలు చెల్లించటమో జరగటమేగాక, సారాబట్టీల వాళ్లు చాలామంది శ్రీకృష్ణ జన్మస్థానంలో ఉంటారు కదా! చివరకు యీపని చేయించింది మనమేనని తెలియక మానదు. మిగతా ఓటర్లతో కూడా విరోధం తెచ్చుకోవటమౌతుంది. పక్కవాడి ఇల్లు తగలబెట్టే వాడు, దాంతోపాటు తన ఇల్లూ తగలబడుతుందనే విషయాన్ని మరచిపోకూడదుగా!'' అన్నాడు లక్ష్మయ్య.

లక్ష్మయ్య చెప్పిన సలహా సహేతుకంగా ఉన్నది. రాజకీయాల్లో వెధవ ఉద్రేకాలకు లోబడి, పిచ్చి పనులు చేయకుండా లక్ష్మయ్య లాటి కుడిభుజాలు-తెలివిగా ఆలోచించేవి ఉండటం అత్యవసరం; ఈ పద్ధతిని అనేకమంది నాయకులు ఆచరణలో పెట్టి, మార్గదర్శకు లయ్యారనే సంగతి ఛోటా నాయకుడైన తనకు తెలియక పోతేగా?

"ఈ వెధవ వయోజన ఓటింగ్ పద్ధతి వచ్చి నానా రభసా చేసింది! ఎరుకల, ఏనాది, దొమ్మరి, మాల, మాదిగ, హరిజన. గిరిజన ఇత్యాది ప్రతి మెడకాయమీది తలకాయకూ ఓటేనాయె! ఓటు విలువ పోయింది: కాకపోతే ఒక ముంత కాపుసారానుంచి రెండు ముంతలకు పెరిగిందనుకో!''

"వయోజన ఓటింగ్ ఉండబట్టే మన పార్టీవాళ్ళు దిగ్విజయంగా ఎలక్షన్‌లో గెలుచుకు వస్తున్నారు బావా! ఇవాళ మనకది కొంచెం చుక్కెదురు ఐనంతమాత్రాన ఆ పద్ధతినే తిట్టిపొయ్యటం సబబుగా తోచదు!''

"మ రేమిటి మార్గం?''

"కాపుసారా పంపిణీ కోటా పెంచుతే?''

"ఇంకా నయం! మనమూ, పెంచి, రంగారావూ పెంచటం ఆరంభిస్తే చుట్టుపట్ల గ్రామాల్లో తయారయ్యే కాపుసారా అంతా కూడా చాలదు!

మన గొయ్యి మనమే తవ్వుకున్నట్లవుతుంది....ఇదేం ఎసెంబ్లీ ఎలక్షనా? మంత్రి పదవికి పాకులాడే అవకాశమా-ఏమన్నానా?....పదివేలు! అంత ఖర్చు పెట్టదగిందేనా?''

మృగరాజు వేటకు బయలుదేరుతే అల్లంత దూరాన నక్క-కూడా అనుసరిస్తుంది; సింహం వేటాడి తినగా మిగిలింది వొదులుతే నక్క ఆరగిస్తుంది. ఆ పద్ధతిలోనే శంకర్యలాటి సింహం వెనకాలపడిన నక్కలాటి లక్ష్మయ్యకి ఏటా ఐదారువేలన్నా సంపాయించుకుంటూనే ఉండగా. శంకరయ్య ఎన్ని వేలు పుంజుకుని ఉండి ఉండొచ్చో లక్ష్మయ్య అంచనాలు వేస్తూ, శంకరయ్య దొంగ ఎత్తుల్ని అంగీకరించినట్లు నటిస్తున్నాడు.

"ఇక్కడ కూర్చొని ఎంత ఆలోచించినా యిది తెగదు బావా!''

"మరి ఎక్కడికి వెళ్ళాలంటావు? చెరువుగట్టుమీదికా?''

"ఉహుఁ. అసలీ వూళ్ళో వెలగబెట్టవలసింది లేదు-''

"ఉన్న ఊరు వొదలమంటావా? ఇంతబతుకూ బతికి ఇంటి వెనకాల చచ్చినట్లు చేసుకోమంటావా?''

"అదికాదయ్యా! ఈ తోలుబొమ్మలాటలో దారాలు ఎక్కడ గుంజాలో అక్కడే గుంజాలి....అంటే తాలూకా ప్రెసిడెంటును ఆశ్రయించటం లాటిది....''

లక్ష్మయ్య మాటలకు అడ్డొచ్చి శంకరయ్య అన్నాడు: "వాడా! వాడు లాభం లేదయ్యా! మనమీద విరోధులు చెప్పిన సాడీలన్నీ వాడి తలకాయలో సాలెగూళ్ళల్లే అల్లుకున్నవి—''

"ఐతే జిల్లా ప్రెసిడెంట్ ఉన్నాడుగా!''

"ఆయనకూ్కడా మనమీద అంత మంచి అభిప్రాయం ఉన్నదనిపించదు; ఎలక్షన్ ఫండ్‌కు ఏమీ ఇవ్వలేదని నామీద గుర్రు!''

"ఇప్పు డొక వెయ్యో. రెండువేలో పారేస్తే సరి!

"ఇదొక అమదమా!''

"అది కాదు బావా! రెండువేలు పారేసి, ఈ గ్రామంలో కాంగ్రెస్ పలుకుబడి పోకుండా చూసే బాధ్యత ఆయన నెత్తిమీద పెట్టాలి....అంటే విత్తు చల్లి పండు కోసుకోవాలి. ఆయనకు నచ్చచెపితే ఇక్కడి ఖర్చులు

ఎలెక్షన్ ఫండ్‌నుంచి మంజూరు చేస్తాడు. పెద్ద నాయకుల్ని మనకు సపోర్టుగా పంపుతాడు. నాకు తోచిన వాటిల్లోకల్లా ఇదే మంచి పద్ధతి!''

శంకరయ్యకు యీ ఆలోచన సర్వవిధాలా నచ్చింది. ఎలా సాధించుకొని రావాలా అని దీర్ఘంగా ఆలోచించసాగాడు.

"లేనిపోనివి కల్పించి చెప్పాలి బావా! వారిజాక్షులందు, వైవాహికము లందు.... అన్నారే.... ఆ లిస్టులోకి రాజకీయాలందు, రచ్చబండలందు.... అని కూడా జేర్చుకోకపోతే బతకలేం.... రాజకీయ నాయకుడి విజయాలు బ్రహ్మని తిమ్మినీ, తిమ్మిని బ్రహ్మినీ చేయగల సామర్థ్యం మీదనేగా ఆధారపడి ఉండేవి. కనుక....''

"కనుక అందుకు పథకం వేసెయ్!''

ఆ ప్రణాళికను రూపొందించటంలో ఉభయులూ నిమగ్నులయ్యారు....

## 2

జిల్లా ప్రెసిడెంట్‌ను చూసి తిరిగివచ్చిన శంకరయ్య మొహం చూశాక 'కాయా? పండా?' అని అడగవలసిన ప్రశ్నలో మొదటిమాటే జవాబనే విషయం లక్ష్మయ్యకు తెలిసిపోయింది.

శంకరయ్య ధుమధుమలాడుతున్నాడు. తనుగా కదిలేస్తే ఆవేశంలో కిందుమీ దవుతాడని లక్ష్మయ్య మెదలకుండా ఊరుకున్నాడు. అంత ఆవేశాన్ని ఎలాగూ కక్కక మానడు కనుక కాస్త ఓపిక పడితే సరిపోతుందని లక్ష్మయ్య అంచనా.

త్వరలోనే శంకరయ్య అగ్నిపర్వతమల్లే పగిలాడు.

"దేశమంతా మట్టికొట్టుకు పోతోంది! పత్రికల్లో చదివే కరప్షన్—జరుగుతూన్నదాంట్లో యెంత కొద్దో అనిపిస్తోంది. అల్పులకు అధికారం వచ్చి పడింది, ఇక యీ భారతమాత ఏమౌతుందో!'' ఉపన్యాస ధోరణిలో జనరల్ రిమార్కులు విసిరిపారేశాడు ముందుగా.

"దేశం సరే బావా! మన సంగతి—''

"నా మొహం చూస్తే తెలియటంలా?''

ఎందుకు తెలియలేదూ? మొహం ఈ రూపధారణకు ముందు పొందిన రసాయనిక మార్పులు విన గోరాడు లక్ష్మయ్య, అడుగుతే ఏం అపచారమోనని మౌనం వహించాడు.

కోపోద్దీపితమైన నిశ్శబ్దం కొన్నిక్షణాలు సాగింది. ఆ తరువాత శంకరయ్య తనను తాను సంబాళించికొని, సాధ్యమైనంతగా అనవసరపు ఆవేశాన్ని తగ్గించుకొని, జరిగిందంతా పూసగుచ్చినట్లు చెప్పకుండా ఉండలేక పోయాడు.

జిల్లా ప్రెసిడెంట్ పరమయ్యను ఆఫీసులో కలుసుకోవటం మంచిదా, ఇంటిదగ్గర కలుసుకోవటం మంచిదా అని తీవ్రంగా ఆలోచించి-ఆఫీసులో ఐతే పదిమందీ ఉంటారు కనుక, వాళ్ళముందు యీ గోడంతా వెళ్ళపోసుకోవటం అవమానకరంగా ఉంటుందనీ, అంత అవకాశం ఉండక పోవచ్చుననీ-కనుక ఇంటి దగ్గర తీరిగ్గా అన్ని విషయాలూ చెప్పకోవాలని నిశ్చయించుకున్నాడు శంకరయ్య. ఆరింటికల్లా ఒక బుట్టెడు ఏపిల్స్, ద్రాక్ష, చక్రకేళీలూ తీసుకొని సైకిల్ రిక్షాలో వెళ్ళాడు. దారిలో తాను పడవలసిన ఆపసోపాలను గూర్చి ఒకటికి నాలుగు సార్లు మననం చేసుకొన్నాడు.

శంకరయ్యను చూడగానే పరమయ్య కనుబొమలు ముడివడినవి-పళ్ళబుట్ట చూశాక ఒక విషపు నవ్వు విసిరి "ఎందుకండీ ఇప్పు డివన్నీ!" అన్నాడు మాటవరసకు. మరుక్షణంలో పనివాడు ఆ బుట్టను గృహాంతర్భాగంలోకి జేరవేసి చోటు ఖాళీ చేశాడు.

దొంగ నమస్కారాలూ, కుశలప్రశ్నలూ అయాక శంకరయ్య రెండువేల రూపాయి లున్న కవరు తీసి పరమయ్యకు అందిస్తూ, "కాంగ్రెస్ యెలక్షన్ ఫండుకింద జమ చేయించండి.........యేదో ఉడతాభక్తి!" అన్నాడు.

పరమయ్య ముఖం కొంత వికసించింది.

"ఆఫీసుకే తేలేకపొయ్యారా? రశీదు పుస్తకం కూడా ఇక్కడ లేదే?" అన్నాడు పరమయ్య-"ఎంత?"

"రెండువేలు!"

పరమయ్య లెక్కపెట్టుకోకుండానే కవరు జేబులో పెట్టుకున్నాడు.

"ఏమిటి మీ గ్రామ విశేషాలు?" అన్నాడు పరమయ్య మాటవరసకు అడిగినట్లుగా.

"చాలా గొడవ గొడవగా ఉన్నదండీ! రంగారావనే భ్రష్టు డొకడు బయలుదేరి ప్రశాంత రాజకీయ వాతావరణాన్ని కలుషితం చేస్తున్నాడు!"

"ఉహుఁ. పేరు విన్నట్లే జ్ఞాపకం....కమ్యూనిస్టా?"

"కాదు....ఏ ఇస్టూ కాడు. స్వతంత్రంగా నిలబడుతున్నాడు. కాంగ్రెసును దుమ్మెత్తి పోస్తున్నాడు. దేశం అధోగతి పాలయేందుకు కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమని ప్రజల్ని ఉత్తేజపరుస్తున్నాడు."

ఆ చివరి మాట పరమయ్యకు గొంతు దిగలేదు.

"ప్రజల్ని ఉత్తేజపరచటం అంత తేలికేం కాదు. ఏమంటాడూ?" అన్నాడు పరమయ్య.

తన మాటలకు అడ్డొచ్చినందుకు శంకరయ్యకు కాస్త కష్ట మనిపించింది. రంగారావుమీద ద్వేషాగ్ని రగిలే విధంగా అతన్ని చిత్రించాల్సిన బాధ్యత గుర్తొచ్చింది.

"నానా దుర్భాషలూ ప్రయోగిస్తున్నాడండీ, అసలు కాంగ్రెస్ అంటే కాంగో రేస్ అని పేర్కొంటున్నాడు!"

పరమయ్య వాళ్ళంతా కదిలేట్టుగా నవ్వాడు.

"బాపూజీ దక్షిణ ఆఫ్రికాలో సత్యాగ్రహం చేశారుకదండీ....అందుకని యీ అర్థం తీసి ఉంటాడు....తరువాత?"

ఈ బ్రహ్మాస్త్రం నిష్ప్రయోజనమై నందుకు శంకరయ్య గుండెలు ఒక మెట్టు జారినవి. ఐనా పట్టువిడవటం రాజకీయాలకు విషతుల్యమౌతుంది కదా!

"కాంగ్రెసు ప్రభుత్వంలో దేశమంతా మట్టికొట్టుకు పోయిందన్నాడు!"

"మీరు చెప్పలేదూ-దేశమంటే మట్టి కాదోయ్-దేశమంటే మనుషులేనోయ్!' అని? ఇంకా?"

"దేశాభివృద్ధి ఏ విధంగానూ కనిపించటం లే దన్నాడు!"

"కళ్ళు లేవూ? జనాభా ఎంత అభివృద్ధి ఐందీ! ధరలూ, పన్నులూ యెంత పెరిగినయ్! ఒక్కో ప్రాజెక్టు కట్టేందుకు ముందుకు జరిపిన ఫౌండేషన్ స్టోన్ సెరిమనీలకు ఎన్నెన్ని లక్షలు ఖర్చుపెడుతున్నామో చూస్తేనే ఆ ప్రాజెక్టులు ఎంత గొప్పవై ఉండాలో గ్రహించవచ్చునే! పంచవర్ష ప్రణాళికల్ని గూర్చి అందరూ చదవాలండీ! అసలు 'పంచవర్ష ప్రణాళిక' అనే పదప్రయోగంలో ఒక అద్భుతం గ్రహించారా! చేతివేళ్ళు ఐదూ తేలేట్టుగా వేసిన దెబ్బకు అది చిహ్నం. ఒకో చరుపుకు దేశం ఉరుకులు పరుగుల్తో ముందంగలు వేస్తోంది. ప్రజల జీవన స్థాయి ఎంత పెరిగిందో ప్రస్తుత ఆర్థిక స్థితిగతులే తెలియజేస్తున్నవి. సిమెంటు దొరకటం లేదు; పంచదార నానా అవస్థ పడితేనే కాని లభ్యమవదు........ అంటే ఏమిటి? ఎక్కువమంది వీటిని కొనగలుగుతూండడం వల్ల ఉత్పత్తి సరిపోవటంలేదు. ఆరోగ్యకరమైన ఆర్థిక విధానంలో అత్యధిక సంపాదనకు ఇదొక ప్రబలసాక్ష్యం.ఇంతకన్న రుజూలు ఏం కావాలయ్యా?" మంత్రులు చెప్పే జవాబుల సారాంశం, తను పత్రికల్లో చదివేదే తిరిగి వినవలసి వచ్చినందుకు శంకరయ్యకు చిరాకు కలిగింది.

శంకరయ్య శరీరంమీద జెర్రులు పాకేందుకు సిద్ధంగా ఉన్నట్లు తోచింది.

"జనం కూడులేక ఛస్తున్నారుట!" అన్నాడు రెండోవైపునుంచున్నా నరుక్కొద్దామని.

"ఎవరా జనం? నిజంగానే జనం అలా ఛస్తూ ఉంటే ఆహారసమస్య ఇంత దారుణంగా ఉండి ఉండేదా? ప్రతి సమస్యా ప్రభుత్వమే పరిష్కరించాలంటే ఏదేశంలోనైనా సాధ్యమేనా?కనుక ప్రజలు తమకు తాము సహాయం చేసుకుంటూ తమతమ సమస్యల్ని తీర్చుకుంటూనే ఉన్నారు కదా!" అని అంటించాడు పరమయ్య.

"ప్రతిదీ జాతీయం చేయటంతో దేశ సౌభాగ్యం వమ్మైపోయి ప్రజలకు బీదరికం పంచబడిందట!"

"అట్లాగా? జాతీయం చేయక గుత్తవ్యాపారం ఏ కొద్దిమంది చేతుల్లోనే ఉంచుతే కాపిటలిజమ్ మృత్యుతాండవం చేయదా? ఇక బీదరిక

మంటారా-మనది బీదదేశం. దీన్ని ఐశ్వర్యవంతం చేసేందుకే నాయకులు అనేక పథకాలను ప్రవేశపెడుతూ ఉన్నారు. బీదరికంగా ఉండటమే మంచిదయ్యా! బీదవాడు నలుగురి సానుభూతినీ పొందేందుకు అవకాశా లుంటవి. ఉదాహరణకు మనది బీదదేశం కనుకనే అమెరికా, రష్యా మొదలైన దేశాలు అనేక విధాల సహాయపడుతూన్నవి. మనది ఐశ్వరవంతమైన దేశమైతే, బడుగు దేశాలవాళ్ళు మనను పీక్కుతినేవాళ్ళు. ఇప్పు డా బాధలేదు కదా!"

"హెయిర్‌కటింగ్ సెలూన్లు కూడా జాతీయం చేసేందుకు ప్రభుత్వం ఆలోచిస్తోందనే ప్రచారంకూడా చేస్తున్నాడు!"

పరమయ్య పగలబడి నవ్వాడు.

"ఢిల్లిలో జరిగే సంఘటనలు దావానలం లాగు ఎంత త్వరగా విస్తరిస్తవి!....ఆ మధ్య మనిషివెంట్రుకల ఉపయోగాలనుగూర్చి తీవ్రమైన పరిశోధనలు జరిగినవి. గొర్రెబొచ్చుతో తయారయే దుస్తులవలె మనిషి బొచ్చుతో కూడా ఏమైనా తయారు అవుతుందా అని ఒక పేద్ద కమిటీ మంతనాలు చేసింది. దేశసౌభాగ్యం పెంచేందుకు పెద్ద ప్రయత్నాలయ్యా ఇవన్నీను! బొచ్చుకు ఎగుమతి ఛాన్సు ఉంటే, మనకు ఎంత విదేశీ మారకం వస్తుందో ఆలోచించు! బొచ్చు ఎగుమతిచేయగల దేశాల్లో మనదే పెద్దకోటా అవుతుం దనేందుకు సందేహం లేదు. బొచ్చు ఉత్పత్తిలో మనకన్న పెద్ద చేయి ఎవరికుందయ్యా? కేంద్ర మంత్రివర్గం విస్తరించి రోమ శాఖామాత్యు డొకడు అవతరించేందుకు సిద్ధంచేశారు. ఐతే దురదృష్టవశాత్తూ. సవరాలకు మినహాగా బొచ్చుకు అచ్చొచ్చే ఉపయోగం లేదని రెండు సంవత్సరాల పరిశోధనా ఫలితాలు తెలియజేయటంతో ఆ విషయం డ్రాప్ చేశారు. ఇదే ఫలించినట్లయితే ఎంత నిరుద్యోగ సమస్య తీరిపొయ్యేది! కనుక హెయిర్ కటింగ్ సెలూన్‌లు జాతీయం చేయటమనే ప్రశ్న లేదు!" అన్నాడు పరమయ్య నెత్తిమీది బొచ్చు తడువుకుంటూ.

అడగటం ఆలస్యంగా టేప్‌రికార్డర్‌లోంచి వచ్చిపడే విధంగా జవాబులు చెపుతూంటే శంకరయ్య అదిరిపొయ్యాడు. ఏంచెప్పి పరమయ్య

కోపాన్ని పెంచి తన పని చేసుకోవాలా అని తీవ్రంగా ఆలోచించాడు శంకరయ్య.

"మద్యపాన నిషేధం చేసిన కీడు అంతా ఇంతా కాదని నానా దుర్భాషలూ ఆడుతున్నాడండీ!" అన్నాడు బాపూజీ పవిత్రాశయానికి తప్పక బలం ఉంటుందని!

పరమయ్య అటూ ఇటూచూసి కాస్త రహస్యంగానే అన్నాడు! "మహాత్ముని అంతరంగం ఉన్నది చూశారూ-ఆలోచించిన కొద్దీ, అందులో అఘాతాలు గోచర మౌతయ్యయ్యా! అసలు మద్యపాన నిషేధం అవసరమని ఆనాడు మహాత్ముడు ఎందుకు అన్నాడో ఆలోచించండి! మనది పాసివ్ రెజిస్టెన్స్. ఎదుటివాడు ఒక చెంపమీద చేయివేస్తే రెండోచెంప అప్పగించాలని మహాత్ముని ఫిలాసఫీ! దెబ్బ కాచుకునేందుకు పోలీసుల లాఠీప్రయోగ తీవ్రత తెలియకుండా ఉండేందుకు ఆ రోజుల్లో వాలంటీర్లు తెగతాగి ఉండేవాళ్ళనుకుంటాను. దెబ్బతెలియకుంటే పట్టుదల పెరగదు కనుక, మద్యపానాన్ని నిషేధించాలని పూజ్య బాపూజీ అభిప్రాయపడి ఉండాలి. ఒకో లాఠీదెబ్బకు దిమ్మతిరిగి దేశభక్తిప్రసారం జరిగింది. ఇక బీదా బిక్కీ సంపాదన కాస్తా తాగుడుకు ఖర్చుపెట్టి పస్తులు పడుకోవటం లాటివి అరికట్టటమూ అదీ మామూలు విషయాలు, మీరు జాగ్రత్తగా ఆలోచించారో లేదో! అసలు మద్యపాన నిషేధంలో సోషలిజమ్ ఉందయ్యా!—సోషలిజం!!"

"అదెట్లా?" అన్నాడు శంకరయ్య అదిరిపోయి.

"ఎట్లనా!" అని పరమయ్య మళ్ళీ ఒకసారి అటూ ఇటూ చూసి కాస్త రహస్యంగానే చెప్పాడు! "ఉదాహరణకు మీ గ్రామమే తీసుకుందాం. మద్యపాన నిషేధం లేనట్లయితే ఎవరో డబ్బున్న ఆసామి పాట పాడేవాడు; ఆ లాభాలన్నీ అతనే అనుభవించేవాడు కదా! ఇప్పుడు కాపుసారా పరిశ్రమ దశదిశలా విస్తరించి వర్థిల్లటంతో ఎన్ని కుటుంబాలు, ఎంత జనాభాకు భుక్తి కలిగిందో ఆలోచించు! ప్రస్తుతం దేశంలో పెద్ద పరిశ్రమ భారీ ఎత్తున మూలమూలకూ విస్తరించగలిగింది ఇదొక్కటే కదా! ఇందువల్ల ఏమౌతోందీ? ఒకే వ్యక్తి పరమయ్యే లాభాలు పదిమందికీ జెందుతూ డ్రెమెటిక్ సోషలిస్టిక్ సిద్ధాంతం ప్రయోగాత్మకంగా దిగ్విజయంగా అమలు జరుగు

తోంది. అందుకనే మద్యపాన నిషేధాన్ని ఎత్తివేసేందుకు ప్రజలు ఒప్పరు, ఆ ఇష్యూమీద ఎలెక్షన్స్‌లో నెగ్గుకురావటం ఎవరి తరమూకాదు! గాంధీజీ ఇంతదూరం ఆలోచించి ఉండకపోవచ్చు కాని, మన మంత్రుల మేధస్సులకు ఇదేమంత పెద్దవిషయం కాదు!''

శంకరయ్య శరీరంలోని కీళ్ళు సళ్ళిస్తున్నట్లున్నవి!

"అయ్యా! తాలూకా ప్రెసిడెంట్‌గారు చాటుగా రంగారావుకు సహాయపడుతున్నారనే నా అనుమానం, నేనేదో సాడీలు చెప్పుకునేందుకు తమ దగ్గిరికి రాలేదనుకోండి. కాని కాంగ్రెస్‌లో ముఠాల తత్వం ప్రయోగించబడుతోందని విన్నవించుకుంటున్నాను!''

"చూద్దాం!'' అని చప్పరించాడు పరమయ్య.

"ఎలక్షన్స్‌లో ఓటమిని ఎదుర్కోవాల్సివస్తే చివరకు చూసేదేమిటి సార్?''

"ఏమయ్యా! ఒక వంద సీట్లు పోతే కాంగ్రెస్‌కు కొదవా? ఈ సంస్థ ఒక ఐరావతం! ఈ పెద్ద ఏనుగు తన తొండాన్ని ఊగించుకుంటూ వైభవోపేతంగా నడిచివస్తుంటే—దాని హొయిలు, హుందాతనం కనిపించదా? కొన్ని కుక్కలు మొరుగుతే అయేదేమిటి? అల్పులు కొంతమంది కీటకాలవలె ఎదుర్కొంటే దాని కాళ్ళకింద పడి నలిగి చావరూ?''

"అవి విషకీటకాలైతే?''

"ఆ బరువుకు చావవంటావా? ప్రభుత్వంలో రోడ్‌రోలర్ మెజారిటీ ఉన్నంతకాలం కాంగ్రెస్ వెంట్రుక కూడా కదలదు! మరికొన్ని పంచవర్ష ప్రణాళికలు ఇలా కొనసాగవలసిందే!''

"తీరా యీ ఎన్నికల్లో నేను దెబ్బతింటే అది కాంగ్రెస్‌కు అవమానం అవుతుంది సార్!''

"అంత మాత్రానికే? అప్పుడు ఒక కమిటీని వేసి ఎన్నికలో ఎందుకు పరాజయం ప్రాప్తించిందో ఆలోచిస్తాం!''

"రోగి చచ్చాక వ్యాధిని గూర్చి చర్చించినట్లవుతుంది!''

"చచ్చే రోగిని ఎవరు మాత్రం బతికించగలరయ్యా! అంతగా కొంతమంది ఓడిపోతే—దేశంలో డెమాక్రసీ ఉండబట్టే అపోజిషన్

పార్టీలవాళ్ళు కూడా ఎన్నికల్లో నెగ్గుతున్నా రనేది రుజూ చేసినట్లవుతుంది కూడాను! కొద్దిమంది ప్రత్యర్థులుంటేనే కాని రాజకీయ చదరంగం రక్తి కట్టదు!

ఈ డొంక తిరుగుళ్ళు లాభం లేదని తేల్చుకున్నాడు శంకరయ్య.

"నా కిప్పుడు మన పార్టీ సహాయం కావాలి. మన నాయకులు వచ్చి సభలు చేయటం, నాకు కొంత పైకం యెలక్షన్ ఫండ్‌లోంచి ఇప్పించటం మొదలైనవి అవసరం!"

"ఇప్పుడు నాయకులకు తీరికలేదు. ఇక పైకం అంటారా—ఏదీ? మీరు కాస్త ఫండిచ్చి, చిన్న చేపను ఎరవేసి పెద్ద చేపను పట్టాలని చూస్తు న్నట్లున్నారు. మీ రిచ్చిన విరాళం తీసుకెళ్ళండి!" అన్నాడు పరమయ్య జేబులోంచి కవరు బైటికి తీస్తూ.

శంకరయ్య అభిమానం దెబ్బతిన్నది.

"నా ఉద్దేశం అది కాదు. నేను విరాళంగా ఇచ్చిన దాన్ని తిరిగి నా మొహాన కొట్టి నన్ను అవమానించ వద్దని మనవి. క్లిష్టపరిస్థితుల్లో పడి సహాయం అర్థించాను—అంతే!" ఎంత దైన్యతను ప్రదర్శించాల్సిన ఖర్మ పట్టిందీ!

కవరు పరమయ్య జేబులో నక్కి దాక్కుంది.

"ఖర్చు పెట్టవయ్యా! అధికారంకోసం నానా అగచాట్లూ పడాలి మరి! తరువాత లాభాలతో గుంజుకో! ఇక్కడికొచ్చి యీ సవాళ్ళన్నీ చేయకపోతే మీ ఊళ్ళోనే మొరగరాదూ? నిజమైన రాజకీయ నాయకుడు బతికి ఉన్నాడో చచ్చాడో తెలుసుకోవాలంటే నోరు చూడ మన్నాడు; బతికి ఉన్నంత కాలమూ అది వాగుతూనే ఉండాలి. కనుక కాస్త ఒళ్ళు దగ్గిరుంచు కొని అదేపనిగా వాగవయ్యా! మన మంత్రుల్ని చూసి నేర్చుకో! నీ అంతట నీవు సాధించాల్సింది ఇతరులు సాధించిపెట్టాలంటే ఎట్లా? పనికాదయ్యా ప్రధానం-వాగటం! మొరగటం! దబాయించటం! హుంకరించటం! గాండ్రిం చటం-తెలిసిందా?"

శంకరయ్య ఆశలన్నీ అడుగంటినవి.

"ఆ రంగారావు వాగుతున్నట్లు అంతటా కరప్షనే" అని గొణిగాడు శంకరయ్య.

"ఏమిటీ-కరప్షనా! పేపర్లలో చదువుతూన్నదేగా! అసలు కరప్షన్ను గూర్చి కాస్త ఆలోచించు. దొడ్డిదోవన పనులు చేయించుకోవలసిన వాడు కదా లంచం ఇచ్చేది! అంటే కరప్షన్ అనేది ఎక్కడ మొదలైందో తేలిందా? పోతే కరప్షన్‌తో అనేకమంది బాగుపడుతూనే ఉన్నారు. యీ అధిక ధరలకు జనం తట్టుకునేందుకు లంచగొండితనమే సురక్షితమైన మార్గం! ప్రభుత్వపు ఆఫీసుల్లో లంచగొండితనమే నిర్మూలించాలంటే వాళ్ళ జీతాలు యెంత పెంచాల్సివుంటుందో ఆలోచించు. అధిక వేతనాలు ఇచ్చేందుకు పన్నులు పెరుగుతవి. అంటే ప్రజలమీద మరింత భారం పడుతుంది. అది ఆమోదనీయమా? ఆచరణ యోగ్యమా? అలా కాకుండా ఎవరికి పనులు కావాలో వాళ్ళే లంచాలు ఇచ్చుకుంటూంటారు; అందుకనే వేతనాలు పెంచకపోయినా నిజమైన అల్లర్లు జరగకుండా, తీసుకునే లంచాలతో సంసారాలు గడుపుకుంటున్నారు. అథవా సమ్మెలు చేసినా ప్రజల సానుభూతి ఉండదు-అందుకనే! దేశ శాంతి భద్రతలు యీ సుళువైన మార్గాన్ని అనుసరించటం ద్వారా నెలకొల్పబడుతూన్నవి!"

"బాగుంది-మీ వితండ వాదం!" అన్నాడు శంకరయ్య ఒళ్లుమండి.

పరమయ్యకు యీ దెబ్బతో కోపం వచ్చింది.

"ఏం నాయనా! కరప్షన్ - కరప్షన్ అని వాగావే-నీకేం తక్కువని కరప్షన్ సాగించావు? నీవు పొందిన లాభాలూ, అక్రమంగా చేసిన సంపాదనా మొదలైన వివరాలు నా దగ్గిర ఉన్నాయ్! యెందుకు లెమ్మని ఇందాకటి నుంచీ నీవు మాట్లాడే చండాలమంతా భరించాను!"

తీగె లాగుతే కంపంతా కదిలినట్లయి కంపరమెత్తింది శంకరయ్యకు.

మౌనమే శరణ్యమైంది.

శంకరయ్య గుండెలు జారిపోవటం చూశాక పరమయ్యకు కాస్త జాలి కలిగినట్లుంది; యెట్లాగైనా పార్టీ మనిషే కదా! చూస్తూ చూస్తూ యెలా నట్టనడి సముద్రంలో వాదిలేయగలడు? అందుకని ఓదార్పు మాటలు ఆరంభించాడు:

"ప్రజల్ని ప్రబోధించాలయ్యా! దేశంలో నదుల్లో ప్రవహించేది నీరు కాదనీ, పాలేననీ, కొండలన్నీ తిండి గింజల పర్వతాలేననీ అలంకారపూరితంగా చెప్పవయ్యా! మా లైబ్రరీలో ఇలాటి కవిత్వం కిలోగ్రాముల లెక్కలో ఉన్నది. కావాలంటే తీసికెళ్ళి ఆ పద్యాలన్నీ సభల్లో పాడు; మన పార్టీవాళ్ళచేత చప్పట్లు కొట్టించావంటే, జేరిన అలాగా జనం కూడా సరదాకు చప్పట్లు చరుస్తారు! హరికథలోలాగు పాటలు పాడు....ఏ దేశమేగినా....అన్నది ఈ దేశంలో ఉన్నా అని మార్చు సరిపోతుంది!"

"ఇవన్నీ చుట్టుతోవలండీ" అని శంకరయ్య చప్పరించాడు.

"అంత భయమున్న వాడివి మధ్యలో మరో బుడంకాయను ఇరికించి ఓట్ల సంఖ్యను చీల్చకపొయ్యావా?"

"అప్పుడు రంగారావు మెజారిటీ మరీ పెరిగిపోగల ప్రమాదం ఉంటుంది సార్!"

"అదీ నిజమే! త్రికోణ పోటీకన్న ముక్కుసూటి వ్యవహారమే మంచిది....సమయమంతా మించిపొయ్యాక వచ్చావేమయ్యా?"

"మీరే రక్షించాలి!"

"[illegible]ట్టుపచట్రంలో ఇరకబెట్టవాచ్చేమో ఆలోచిస్తాను. ఈలోగా మీరు అహింసా సూత్రాన్ని అచరించండి. అంటే ఇంట గెలిచి రచ్చగెలవాలనే సూత్రం ప్రకారం ముందు స్వహింస కాకుండా చూసుకోండి. హాయిగా ఉండండి. ఈ యెలక్షన్ పోయినా, పైసారి తప్పకుండా మిమ్మల్ని గెలిపిస్తాను."

ఇంకేమీ ప్రయోజనం లేదని నెత్తిన గుడ్డ వేసుకొని శంకరయ్య మాన్యాల మీదినుంచి స్వగృహం జేరాడు.

"బూడిదలో పోసిన పన్నీరల్లే రెండువేలూ ధారపోశానే!'''' అని గోడు గోడు మన్నాడు.

"నీమీద యెవరో చాలా చెడుగా అనేక సాడీలు చెప్పి ఉంటారు బావా!" అని లక్ష్మయ్య ఊరడింప జూశాడు.

"ఏమైతేనేం-వ్యాధికన్న చికిత్సే ప్రాణాంతకంగా తయారైంది!"

"ఇక మానవ ప్రయత్నంకన్న దైవ ప్రయత్నంమీద ఆధారపడటమే మంచిది బావా! ఇవాళ దివ్యమైన రోజు. స్నానంచేసి భక్తితో వెంకటేశ్వర స్వామికి ముడుపు కట్టు. ఆ స్వామే తనభక్తుణ్ణి ఒక ఒడ్డుకు జేరుస్తాడు."

ఈ కొత్త సలహాతో కొంత మనశ్శాంతి వచ్చిన ట్లనిపించింది శంకరయ్యకు.

## 3

ఓటమితో శంకరయ్యకు దిమ్మతిరిగిపోయింది. తీవ్ర జ్వరపీడితునివలె బాధ పడుతున్నాడు. రెండురోజులనుంచీ వీధిమొహం యెరగడు. కొత్తవాళ్ళు ఆ దారిన వస్తే శంకరయ్య ఇల్లు పాడుపెట్టా రనిపించక మానదు.

ఈ రెండు రోజులూ మిత్రులని భావించిన వా రెవరూ వచ్చి శంక రయ్యను ఊరడించలేదు. రెండువేల ముడుపు చెల్లించిన పరమయ్యకే ఏమీ పట్టకుంటే ఇక మీగతావాళ్ళ సంగతి దేనికి? పోనీ లక్ష్మయ్యన్నా వచ్చి ఓదార్పు మాటలు చెప్పినా బాగుండేది. అతనికి మాత్రం ఏం అవసరం? రాజకీయాలను వ్యాపార దృష్టికి దించాక సిద్ధాంతాలతో, వ్యక్తులతో సంబంధం ఉండదు. మెజారిటీ వైపు మొగ్గుతే వేగంగా ప్రవహించే నదిలో వాలున ఈత ఈదినంత సుఖం! లక్ష్మయ్యకూడా తనను విడనాడినట్లే ననుకోవటం మంచి దనిపించింది.

హఠాత్తుగా మూడోరోజు లక్ష్మయ్య ఊడిపడ్డాడు. శంకరయ్య మొహంలోని ప్రేతకళ చూసి హడిలిపొయ్యాడు.

"ఇంత దిగజారి పొయ్యావేం బావా!" అన్నాడు ఆప్యాయంగా.

లక్ష్మయ్య నిజాయితీని తను సందేహించినందుకు తనలో తాను నొచ్చుకున్నాడు శంకరయ్య.

"లక్ష్మయ్యా! ఈ ఇల్లే ఇక నా సమాధి! ఇన్నాళ్లు ఏమయ్యావయ్యా?"

"అలా అనకు బావా! నేను మన పనిమీదనే ఉన్నాను-!"

"శవాలంకరణలాగు ఇంకా పనేమిటయ్యా?"

"అంతేనా? నందగిరి స్వాములవారని నేనుచెపుతూంటాను గుర్తుందా? ఆయన దర్శనం చేసుకొని నీలాటి సత్పురుషునికి వచ్చిపడిన ఆపత్తును

గూర్చి వివరించాను. ఆయన తీవ్రంగా ఆలోచించి దేవపురంలోని శివాలయానికి వెళ్ళి పూజలు చేయమన్నాడు. అక్కడి విశేషం విన్నావంటే ఒళ్ళు జలదరిస్తుంది. ఏడునెలలక్రితం ఒక శివలింగం బైటపడగా గ్రామస్థులు ఒక చిన్న దేవాలయం నిర్మించారు. లింగప్రతిష్ఠ నాడు ఎనిమిది అడుగుల నల్లతాచు శివలింగాన్ని చుట్టుకొని ఉన్నదట! అది సాక్షాత్తు శంకరాభరణమే అయి ఉంటుందని భక్తులు పూజలు చేశారు. అదెంత భయంకరంగా కనిపిస్తుందో అంత సాధువట! పాలు, మీగడా మొదలైనవి అర్పిస్తే వచ్చి ఆరగిస్తుందట. భక్తితో దాన్ని కొలిస్తే మనసులో కోరిన కోరికను తీరుస్తుందట. స్వాములారు యెన్నో దృష్టాంతాలు చెప్పి, మిమ్ము అక్కడికి తీసుకొని వెళ్ళి నాగ పూజ చేయించమన్నారు!" అన్నాడు లక్ష్మయ్య.

"చెప్పకయ్యా! పాము అంటేనే నాకు హడల్! చచ్చిందాన్ని చూస్తేనే ఒంటిమీద జెర్రులు పాకుతూంటయ్!"

లక్ష్మయ్య పకపకా నవ్వి "చచ్చిన పామును చూస్తే భయమేంటి బావా!" అన్నాడు.

"ఔనయ్యా! బతికి ఉన్నదైతే కదిలన్నాపోతుంది; చచ్చింది అక్కడే పీఠమేసుకు కూర్చుంటుందాయె....ఆ పాము దగ్గిరికి వెళ్ళి దానికి పాలుపట్టి నాగపూజ చేయమన్న సలహా ఇస్తున్నావా? వెంకటేశ్వరస్వామికి ముడుపు కడితేనే ఏమీ అవలేదు కదా! ఇక యీ తాచు పామా!" అని ఈసడించాడు శంకరయ్య.

"అపచారం-బావా! అపచారం!....చెంపలు వేసుకో - వేంకటేశ్వర స్వామికన్న యీ పామే నయం! స్వామి విగ్రహం శిలే కదా! కదలదు; మెదలదు. కాని ఇది పాకుతుంది; కళ్ళ ఎదుట తిరుగులాడే ప్రాణి! పడగ ఎత్తి ఆటలాడే పన్నగం. సరాసరి కైలాసంనుంచే వచ్చింది బావా! దాని మహత్తు అత్యద్భుతమట! కనుక ఒకసారి వెళ్ళివద్దాం....మనకు పదిమైళ్ళలోనే దేవ పురం ఉంది...."

శంకరయ్య ఆలోచనలో పడ్డాడు.

"ఏనా నాకేం కోరిక లున్నయ్? ఓడిన యీ ఎలక్షన్స్‌లో గెలవలేం కదా!"

"బావా! శత్రుశేషం ఉండరాదయ్యా! అసలు యీ విచిత్ర మేమిటో చూడాలి—"

"పాలు పడుతూండగా పాము కాటు వేస్తే?"

"అలా ఎన్నటికీ జరగదయ్యా! అదేం సామాన్యమైన సర్పమా? దేవతా సర్పం! ఎంత సాధువని! మాంసాహారం ముట్టదట! అది అంత గొప్పది కాకుంటే శివలింగం దాన్ని భస్మం చేయదా?"

శంకరయ్య మన స్సరోవరంలో నిండుగా, మెండుగా వింత వింత కోరికలు కలవపూలవలె మొలకెత్తినవి.

"రేపే వెళ్ళాం బావా!"

"ఈ పాడుమొహం ప్రజల కెలా చూపనయ్యా?"

"తెల్లవారుజామునే బయలుదేరి వెళ్దాం....చీకటి పడ్డాక తిరిగి వద్దాం....కా దనకు! తెల్లారుగట్ట నాలుగింటికల్లా వస్తాను. భయపడకు బావా!"

శంకరయ్యచేత 'సరే' ననిపించుకొని లక్ష్మయ్య వెళ్ళిపోయ్యాడు. శంకరయ్యకు ప్రవాహంలో కొట్టుకొని పోయ్యేవాడికి గడ్డిపోచ దొరికిన ఆనందంలాటిది కలిగింది.

తాను నాగదేవతను కోరవలసిన కోర్కె విషయంలో శంకరయ్యా దృఢనిశ్చయు డయ్యాక మనశ్శాంతి చిక్క నారంభించింది.

# 4

శివాలయం దగ్గిర తీర్థప్రజను చూసేప్పటికి శంకరయ్య విశ్వాసం మిన్ను ముట్టింది. ఈ సర్పానికి ఎంత మహత్తులేకుంటే యీ తిరణాళ్ళకు ఇంత మంది ప్రజలు వస్తా రనిపించింది.

లక్ష్మయ్య పలుకుబడితో అందరికన్నా ముందుగా గర్భగుడిలోకి శంకరయ్య ప్రవేశించే అవకాశం లభించింది.

శివలింగాన్ని చుట్టపెట్టుకొని ఉన్న ఆ నల్లతాచును చూసేప్పటికి శంకరయ్యకు చెమట పట్టింది. భారమంతా ఆ ఈశ్వరుడి మీద వేసి ఎలాగో గుండె చిక్కబట్టుకున్నాడు.

వెండిగిన్నె నిండా పాలుపోసి అక్కడ పెట్టి పాముకు సాష్టాంగ పడ్డాడు. రెండుసార్లు పాము పడగెత్తి బుస్సు బుస్సు మన్నది.తన ఆరాధన దానికి ఇష్టంలేక తిరగబడితే తన ప్రాణం యీ శివాలయంలోనే హరీ అంటుందేమోనని శంకరయ్యకు ఒక్కక్షణం భయం వేసింది.

మెల్లిగా పాము చుట్టలు విప్పుకొని పాలగిన్నెవైపు పాకింది. తోక మీద లేచి పడగవిప్పి నలు దిశలా చూసింది. శంకరయ్యకు కాళ్ళు ఒణుకు తున్నవి. ఆ తరువాత అది మామూలు స్థితికి వచ్చి పాలగిన్నెమీద మూతి పెట్టి, తాగిందో, లేదో తెలియకుండానే వెనక్కు లాక్కుంది. ఆ సమయంలో బతికి బైటపడ్డంత సంతోషమై, చేతులుమోడ్చి మనస్సులో తన కోరికను మన్నించమని భక్తితో శంకరయ్య ధ్యానించాడు.ఆరగింపును ఆదరించటమే కోర్కెను తీర్చటమనే దృష్టాంతాన్ని శంకరయ్య నమ్మాడు. భక్తునికి,అభీష్ఠ సిద్ధి ప్రసాదించానన్న విధంగా పాము తల విదిలించి-మళ్ళీ పడగెత్తి, రెండు సార్లు తల ఊచి, శివలింగంవైపు వెళ్ళిపోయింది.

"ధన్యుడివి బావా!" అన్నాడు లక్ష్మయ్య రహస్యంగా.

శంకరయ్య మళ్ళీ ఒకసారి నాగదేవతకు నమస్కరించి గుడిలోంచి బైటపడ్డాడు.

సాయంత్రందాకా ఆ ఊళ్ళోనే గడిపి చీకటి పడుతూండగా స్వగ్రామం జేరేట్లు ప్రయాణమయ్యాడు శంకరయ్య, లక్ష్మయ్య తోడుగా.

సామాన్యంగా ఏడుగంటల వేళ ఊరంతా మాటుమణిగి ఉండవల సింది-గొడవ గొడవగా ఉన్నది. గుంపులుగా జనం అక్కడక్కడ మంత నాలు చేస్తున్నారు. ఎలెక్షన్స ఐపొయ్యాక ఇలాటి హడావిడి ఆశ్చర్యంగానే తోచింది శంకరయ్యకు.

ఇదంతా ఏమిటో విచారించేందుకు మొహం చెల్లక, తన మొహాన్ని ఇతరులకు చూపేందుకు మన సొప్పక విషయ మేమిటో కనుక్కొని రమ్మని లక్ష్మయ్యకు పురమాయించి పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ శంకరయ్య ఇంటికి వెళ్ళాడు.

శంకరయ్య కాళ్ళు కడుక్కుంటూ ఉండగానే విల్లు విడిచిన బాణమల్లే లక్ష్మయ్య వచ్చి పడ్డాడు.

"బావా! చూశావా! ఆ పాము మహత్తు!"

"ఏమిటయ్యా!"

"గంటక్రితం రంగారావును ఒక ఎనిమిదడుగుల తాచు కరిచిందట. స్పృహలేకుండా పడిపోయిన రంగారావును టౌన్‌కు తీసుకొని వెళ్ళారు. కొంతమంది పాముల నరసయ్యకు ఫోన్ చేసేందుకు పరుగెత్తారు-"

"ఆ!" అన్నాడు శంకరయ్య తన చెవులను తానే విశ్వశించలేక.

"నిజం బావా! ఆ పామును చంపారట!"

"శివ శివా!" అన్నాడు శంకరయ్య నాగదేవతమీది భక్తిని వొలక బోస్తూ.

"రంగారావు బతకడనే అంటున్నారు!" అన్నాడు లక్ష్మయ్య నీర సించిన స్వరంతో.

శంకరయ్య ఆనంద పారవశ్యంతో మౌనం వహించాడు.

"బావా! నీవు కోరిన కోరిక ఫలించిం దనటానికి ఇంతకన్న రుజూ ఏం కావాలయ్యా?" అన్నాడు లక్ష్మయ్య.

తను కోరిందాన్ని లక్ష్మయ్య యెలా గ్రహించాడో శంకరయ్యకు ఇప్పుడు తెలిసిపోయింది. తర్కానికి చోటులేకుండా శంకరయ్య చిరునవ్వే జవాబుగా వొదిలాడు.

"మన ప్రయాణం సంగతి ఎవరితోనూ అనొద్దు" అన్నాడు శంకరయ్య.

"నన్ను అంత తెలివితక్కువ దద్దమ్మగా జమకట్టావా బావా!" అని నవ్వుకుంటూ లక్ష్మయ్య వెళ్ళిపొయ్యాడు.

మర్నాటి ఉదయం శుభవార్తను కర్ణోపేతంగా వినగలననే ధీమాతో ఆ రాత్రి శంకరయ్య హాయిగా నిద్రపోగలిగాడు.

## 5

సూర్యోదయంతోపాటే లక్ష్మయ్య కూడా ఊడిపడ్డాడు.

"రంగారావు ఇంకా చావుబతుకుల్లోనే ఉన్నాడట. పాముల నర సయ్య తెల్లవారుజామున దొరికాడట....ఏవో మంత్రాలూ, తంత్రాలూ

జరుపుతాననీ, బహుశా ప్రాణభయం లేదని తాను చెప్పినట్లు రోగికి చెప్ప మన్నాట్ట! ఆయనకూ అనుమానమే! మంత్రాలకు చింతకాయలు రాలే రోజులా ఇవి! అసలు రోగికి స్పృహ ఉంటేగా పాముల నరసయ్య కానీ, వాడి బాబుకానీ చెప్పింది వినటానికి! ఆస్పత్రిలో డాక్టర్లు కూడా ఆశలు వొదులుకున్నారట! శవావతరణ అవగానే బైటికి తోసే లెక్కలో ఉన్నారట!....ఆ పాము ఇంట్లోకి జొరబడి మరీ కాటు వేసిందిట!''

పరిపూర్ణమైన తృప్తి కలగకపోయినా, దాదాపు ఆ ప్రాంతాలదాకా తృప్తయింది శంకరయ్యకు.

''ఎవరో చెప్పారు బావా! కొంతమంది రంగారావు తాలూకు బంధుమిత్రులు దేవపురం పరుగెత్తారట! ఆ నాగదేవత రక్షించగలదని వాళ్ళ విశ్వాసం!''

శబ్దమయ్యే నిశ్వాసం వెలువడింది శంకరయ్యా నోటినుంచి.

''అడ్డమైనవాళ్ళ కోర్కెలూ ఆ పన్నగం మన్నిస్తుందా?'' అన్నాడు లక్ష్మయ్యా.

కాని శంకరయ్యా గుండెల్లో గాలం పడింది. దేవపురం మీదా, అక్కడి తాచుమీదా అతనికి గతదినం ఏర్పడిన హిమాచలంలాటి విశ్వాసాన్ని కదిలించటం పదిమంది రావణుల తరంకూడా కాదు!

''నువ్వేం భయపడకు బావా!''

శంకరయ్యకు ఏమీ వినిపించటంలేదు. దేవపురంలోని దేవాలయం, నిగనిగలాడే ఆ నల్లతాచూ, అది పాలు ఆరగించి భక్తుల కోర్కెలు మన్నించటం మొదలైన విషయాలతో తల తిరిగిపోతోంది.

''ముందు మన కోరిక మంజూరైందనే సంగతి మరిచిపోకు!''

శంకరయ్యా కూర్చున్నవాడు కూర్చున్నట్లే ఒక పక్కకు వొరిగిపొయ్యాడు.

లక్ష్మయ్యా హడిలిపోయి, ఇంట్లోవాళ్ళ సహాయంతో శంకరయ్యను మంచంమీదికి జేర్చి ఊళ్ళో కొత్తగా వచ్చిన ఎల్. ఐ. ఎమ్. డాక్టరుకు కబురు పెట్టాడు.

డాక్టర్ పరీక్షచేసి 'షాక్' అన్నాడు. బ్లడ్‌ప్రషర్ కూడా ఉన్న

దన్నాడు. విశ్రాంతీ, మనశ్శాంతీ అవసర మన్నాడు. ఒక ఇన్‌జక్షన్ యిచ్చాడు.

రెండు గంటల తరువాత శంకరయ్యకు స్పృహ వచ్చింది. వెకిలి నవ్వు తనలో తాను నవ్వుకున్నట్లు తోచింది చూసేవాళ్ళకు.

లక్ష్మయ్య పక్కన జేరి "భయపడకు బావా! రోజులు మనవి!" అన్నాడు,

శంకరయ్య జవా బివ్వలేదు. మగతగా ఉండి కళ్ళు మూసుకున్నాడు. ఇంట్లో వాళ్ళకు భయం పట్టుకుంది.మళ్ళీ డాక్టర్ను పిలిస్తే ఇంకో ఇన్‌జక్షన్ పడింది.

శంకరయ్యకు మెలుకూ వచ్చేప్పటికి గోడకు ఉన్న బెడ్‌లైట్ వెలుగుతోంది. భార్య తలవైపు నేలమీద కూర్చొని తన మంచాన్ని ఆను కుని కునిపాట్లు పడుతోంది. బహుశా అర్ధరాత్రి అయి ఉండొచ్చు. తను బతికే ఉన్నాడు....మరి రంగారావో? ఎవర్ని అడగాలి? రంగారావు చచ్చా డనేదాకా తన గుండెలు కొట్టుకునే హోరులో చెవులు గింగుర్లు ఎత్తుతూనే ఉంటవి.

దాహంతో నాలుక పిడచగట్టుకుని పోతోంది. భార్యను తట్టిలేపి మంచినీళ్ళు కావాలని సౌజ్ఞ చేశాడు,

నీళ్ళు తాగాక కాస్త త్రాణ వచ్చింది.

"కాఫీ తాగండి!" అన్నది భార్య!

తలూపాడు శంకరయ్య. ఆ వేడి కాఫీ గొంతు జారుతూంటే మళ్ళీ యీ లోకంలోకి పడిన ట్లనిపించింది శంకరయ్యకు.

"కాస్త పళ్ళరసం ఇమ్మంటారా?" అన్నది భార్య.

'ఒద్దు' అని సౌజ్ఞ చేశాడు శంకరయ్య.

పక్షవాతంలాటిది వొచ్చి నోరు పడిపోయిందేమోననే భయం వేసింది శంకరయ్య భార్యకు.

"మాట్లాడలేరా?"

"ఏం మాట్లాడ మంటావూ?"

ఆమెకు మహదానందమైంది. శంకరయ్య ఫాలభాగంమీద చేయి వేసి "జ్వరంతో వొళ్ళు పేలిపోతోంది-పడుకోండి!" అందామె.

శంకరయ్య కళ్లు మూసుకున్నాడు. అతనికి ఆ అంధకారంలో-తాను కిందటి రోజునచూసిన భయంకరమైన ఆ సర్పం సాక్షాత్కరించింది. యీసారి ఆ పాము పడగెత్తి తనమీదికి లేచి బుస్సు బుస్సు మంటోంది. బహుశా రంగారావు బంధుమిత్రులు కూడా అమిత భక్తితో దాన్ని ఆరాధించి ప్రసన్నం చేసుకొని ఉండొచ్చు. రంగారావు ప్రాణరక్షణా, తన ప్రాణ భక్షణను వారు కోరి ఉండొచ్చు. అందుకనే అది తనను కలలో బెదిరిస్తోందేమో?

రంగారావును రక్షించమని వారు కోరటం సబబే కాని, తన మృత్యువును కోరటం దేనికి? తను వెళ్ళి యీ పామును ఆరాధించి వచ్చిన సంగతి వాళ్ళకు తెలిసి ఉంటేనే ఇలాటి కోర్కెకు అవకాశం ఉంటుంది. ఆ సంగతి తనకూ లక్ష్మయ్యకూ తప్ప ఇతరులకు తెలియదే!

లక్ష్మయ్యను నమ్మట మెలా? ఒక్కసారిగా తన పార్టీనుంచి తన విరోధి వర్గానికి ఉరకాలంటే ఇలాటి కబురు ఎంతో ఉపయోగం కదా! అతనే చెప్పి ఉండొచ్చు. రాజకీయాల విషయంలో ఎవర్నీ నమ్మేందుకు వీలులేదని తన అనుభవం మొత్తుకుంటోంది. ఆ మాటకొస్తే తనను తనే నమ్మేందుకు వీల్లేదు; ఎందుకంటే ఏ సమయంలో ఏ జవాబు చెప్పాలో తనకే తెలియదు; ఒకదాన్నొకటి ఖండించే జవాబులు రాజకీయ జీవితంలో అనేకసార్లు కొండమీదినుంచి దొర్లిపడే రాళ్ళల్లే రాక తప్పదు. ఆ వృత్తే అలాటిదాయె!

వీళ్ళు వెళ్ళి ప్రార్థిస్తే ఆ సర్పం వీళ్ళ వింత కోర్కెను తీరుస్తుందా? ఎందుకు తీర్చదూ? తనకు తీర్చలా? తన గొప్పేమిటి? భక్తి అంటావా? యీమాత్రం బోడి భక్తి వాళ్ళకు మాత్రం లేదా? డబ్బు ఖర్చైతే ఆలోచించాలి కాని భక్తికేం కొదవా? మరీ ప్రమాద స్థితిలో పడ్డారు కనుక వాళ్ళ భక్తి మరింత గాఢమైనదై ఉండాలి, కేవలం భక్తితో జయించేది అవాలే కాని వాళ్ళ కోర్కెను కూడా తీర్చేందుకు ఆ పాము వెనకాడదు. లంచగొండి ఉద్యోగి ఆ లంచం ఇవ్వగలిగిన ప్రతి వెధవాయికీ

పనులు చేసిపెడుతూనే ఉంటాడు. అంతేకాదు-లంచమిచ్చే ప్రతివాడూ తనకు అప్పుడే కనుక ఎదురు బొదురు పక్షాలవారికికూడా ఒక ఆర్డర్‌ను మరొకటి విరుద్ధంగా ఉన్నా మంజూరు చేస్తాడు!

ఈ సర్పానికి మహత్తు లేదని తను యీ జన్మలో నమ్మలేడు. ఆ స్వానుభవం అంత గొప్పదనేందుకు సందేహంలేదు. ఆ మహత్తే తన కిప్పుడు ప్రాణకంటకంగా తయారైంది. వాళ్ళ కోర్కెను మన్నించి, వారి భక్తికి మెచ్చి రంగారావును కాటు వేసేందుకు పంపిన పాము లాటిదాన్నే తనమీద కూడా ప్రయోగించేందుకు అది వెనుకాడదు. ఇప్పుడు తనకేం శరణ్యం? ఏ దివ్యశక్తితో ఆ పాము రంగారావు ప్రాణాలకు గురిచేసి కొట్టిందో, అదే శక్తితో తన ప్రాణాలనూ తోడివేయగలదు. దాని చేతుల్లో ఆ శక్తి ఉన్నంతవరకూ తనకు ప్రమాదం తప్పదు!

భక్తి ఎంతెంత ప్రమాదకరమైన కోర్కెలనైనా సాధిస్తుంది. హిరణ్యాక్షవరాలు ఇవ్వబడలేదా? భస్మాసురుని కోర్కె తీర్చబడలేదా? భక్తికి మత్తెక్కిన దైవశక్తికి న్యాయ విచక్షణ ఉంటుందా? అంతకన్న ఎక్కువ భక్తి చూపాలే కాని, ఆ పాతదాన్ని పడదోసేందుకు వెనుక ముందుల ఆలోచన దేనికి? అధికారం ఉండాలే కాని దాన్ని దుర్వినియోగం చేసేందుకు బహుకొద్ది ఆలోచనే చాలు కదా!

ఈ తలపుల తాకిడికి శంకరయ్య బుర్ర కుతకుతలాడింది. కళ్ళు మూసుకుంటే ఆ పామే సాక్షాత్కరిస్తోంది. కళ్లు తెరిచాడు. ఎదురు గుండా వెలిసెమీది నుంచి ఒక పెద్ద తాచు వేళ్ళాడుతున్నట్టు గ్రహించి భయంతో ఒక్క కేక పెట్టాడు. శంకరయ్య భార్య హడిలిపోయి "ఏమి టండీ?'' అన్నది. శంకరయ్యకు నోటమాటరాక వాణికిపొయ్యి చేత్తో అటక వైపు చూపాడు.

"ఏముం దక్కడ? తాడండీ అది - తాచు అనుకున్నారా?'' అన్నది భార్య.

'తాచు' అనే పదాన్ని ఆమె ప్రయోగించటం దాన్ని ఆహ్వానించ టమే ననిపించింది శంకరయ్యకు.

"ఆ రంగారావును తాచు కరిచిందని విన్నప్పటినుంచీ మీకు భయం పట్టుకున్నట్లుంది!''

తర్కానికి పడితే ఇంకా దిగజారి పోవాల్సి వస్తుందని శంకరయ్య భయపడి, నిద్ర నటించాడు.

మర్నాటి ఉదయం డాక్టర్ వచ్చి నిన్నటికన్నా రోగి స్థితి దిగజారి పోయిందని తెలుసుకొని ఆశ్చర్య పోయ్యాడు, జాగ్రత్తగా పరీక్షించి పచ్చ కామెర్లున్న లక్షణాలను గమనించాడు. మళ్ళీ ఒక ఇన్‌జక్షన్ ఇచ్చి 'జాగ్రత్తగా ఉండాలి; బ్లడ్‌ప్రషర్ ఎందుకు పెరిగిందో తెలియటంలేదు. లివర్ కూడా ఎఫెక్ట్ ఐంది. మానసిక సంక్షోభం అధికమైంది. రోగికి మనశ్శాంతి అవసరం!'' అని చెప్పి వెళ్ళాడు.

మంచం చుట్టూ ఉన్నవాళ్ళ మొహాల్లో కళాకాంతులు లేవని శంకరయ్య గ్రహించాడు. యీ మందులు నిరుపయోగమనీ. సరైన చికిత్స దేవపురంలోని తాచుపాము చేతుల్లోనో, కాళ్ళల్లోనో ఉన్నదనీ తనకు తెలుసు; బహుశా లక్ష్మయ్యకూ తెలిసే ఉంటుంది. మరి ఆ సర్పాన్ని ఆశ్రయించి సాధించుకుని రావట మెలా? లక్ష్మయ్య వచ్చి శంకరయ్య స్థితి చూసి చాలా భయపడ్డాడు. శంకరయ్య మొహాన ప్రేతకళ పడిందనే సంగతి స్పష్టంగా తెలుస్తోంది. మంచంచుట్టూ మృత్యుదేవత విలయ తాండవం ఆరంభించే సూచనలు కనిపిస్తూన్నవి.

శంకరయ్య ఇంత పిరికి పడిపోవటం లక్ష్మయ్యకు ఆశ్చర్యాన్ని కలిగించింది. ఎన్నో ఓదార్పు మాటలు చెప్పాడు కాని, అవన్నీ గాలిలో కలిసిపోతూన్నవని గ్రహించి శంకరయ్యను పీడించట మెందుకని ఊరుకోవాల్సి వచ్చింది.

శంకరయ్య శరీరంలోని రక్తం తెకతెకలాడుతూ ఆవిరిగా మారి పోతోందా అన్నట్లున్నది. తన నెవరో పెద్ద మంటమీద కాలుస్తున్నారు. కన్ను తెరుస్తే అటకమీదినుంచి వేలాడే మోకు చివరిభాగం తాచుపాములే ప్రత్యక్షం; పోనీ అని కన్ను మూస్తే పడగవిప్పిన పాము బుసకొడుతోంది. తన పన్నాగంలో ప్రధానపాత్ర వహించిన యీ పన్నగం తన ప్రాణానికే ఎసరుపెడుతుందని ఊహించలేదు కదా!

మగతగా అలాగే పడివున్నాడు శంకరయ్య.

రాత్రి ఎనిమిదిగంటల ప్రాంతంలో శంకరయ్య కూతురు హడావిడిగా పరుగెత్తుకొచ్చి "అమ్మా! పామే!'' అన్నది.

శంకరయ్య ప్రాణాలు ఎగిరెగిరి పడుతూన్నవి. కళ్ళు తెరుస్తే అది తనను కాటువేసే ఘోరదృశ్యాన్ని కూడా చూడవలసిన ఖర్మ పడుతుందేమో నని గట్టిగా కళ్ళు మూసుకున్నాడు.

"మెల్లిగా చెప్పవే-ఎక్కడ?"

"దొడ్లోనే....నల్లని తాచు....రెండు బార లున్నదే....నన్నుచూసి జరజరా పాక్కుంటూ గోడలోకి దూరిందే!" అన్న దా అమ్మాయి ఉద్రే కాన్ని తగ్గించుకోలేక, కంఠస్థాయిని మాత్రం తగ్గించి.

తన మృత్యుదేవతకూ, తనకూ మధ్య ఉండే దూరం-యీ శయ్యకూ, దొడ్డిగోడకూ మధ్య ఉండే దూరమేననే నమ్మకం ఏర్పడింది శంకరయ్యకు.

ఆ వీధిలో ఉన్న వీరులందరికీ ఆహ్వానాలు వెళ్ళినవి. గోడ తవ్వి కూడా చూశారు; కాని ఆ పాము ఎవరికంటా పడలేదు.

"ఏదన్నా చూసి పామని భ్రయపడ్డావేమోనే!" అన్నది శంకరయ్య భార్య.

"కళ్ళారా చూశానమ్మా! పెద్ద తాచు....జరజరా పాకుతేనే! భయ మేసి పరుగెత్తుకొచ్చాను!" అన్న దా అమ్మాయి.

పెట్రొమాక్స్ లైట్లు వేసుకొని దొడ్డంతా గాలించారు; కాని పాము కనిపించలేదు.

అది కనిపిస్తుందనీ, వీరుల కర్ర దెబ్బలకు గురవుతుందనీ శంకరయ్య అనుకోలేకపోయ్యాడు. నాగదేవత ఆజ్ఞప్రకారం వచ్చిందాన్ని యీ మానవ మాత్రులు ఏం చేయగలరు కనుక?

ఈ తాచు వాత పడకుండా మహాసముద్రంలో ఒంటి స్తంభపు మేడ కట్టుకోగలిగేందుకు తనేం పరీక్ష న్మహారాజా? అలాటి కట్టడంలో ఆ మహా రాజుకు ఎంత రక్షణ లభ్యమైందో తనకు తెలియదా? పోనీ సర్పయాగం చేయించగల స్తోమతు మాత్రం తన కేదీ? నడిసముద్రంలో యీదేందుకు శక్తిలేక అలసిపోయినవాడు మునిగిపోవటమే అత్యుత్తమ మార్గమని నిశ్చయించుకొన్నట్లయింది శంకరయ్య పని. ఆ మగతలో ఒకరకం నిద్రపట్టింది అతనికి.

లక్ష్మయ్య వచ్చాడు. అంతా విన్నాడు; శంకరయ్య భయపడ్డట్లు

నిజంగానే దేవపురంలోని పాము తన భృత్యుణ్ణి పని పూర్తిచేసుకొని రమ్మని పంపిందా అనే అనుమానం అతన్ని కూడా పీడించ సాగింది.

శంకరయ్య శరీరమంతా పచ్చబడింది. కామెర్లు స్పష్టంగా కనిపిస్తున్నవి.

"రంగాచార్లగారి దగ్గిర పసుపు తాడు మంత్రించి తెచ్చాను. ఇది ఆయన మెడలో కట్టండమ్మా!" అన్నాడు లక్ష్మయ్య పసుపురంగు తాడు, ముళ్ళు ముళ్ళుగా ఉన్నదాన్ని శంకరయ్య భార్యకు అప్పగిస్తూ.

"ఆయన నిద్రపోతున్నారు....ఎట్లా?" అన్నదామె.

"మెల్లిగా మెడకిందినుంచి దూర్చి ముడెయ్యండి."

ఆమె శంకరయ్యకు తెలియకుండానే జాగర్తగా మెడలో పసుపు తాడు కట్టి ముడివేసింది.

పరమయ్య పడదోయగా, వెంకటేశ్వరస్వామి వెన్నులో పొడవగా-యీ పామేదో పగలదీస్తుం దనుకుంటే తనను పగబట్టి ప్రాణాలను హరించేందుకు పడగ ఎత్తుకొని రావటం శంకరయ్యకు స్పష్టంగా కనిపిస్తోంది. అది అలా అలా పాక్కుంటూ వొచ్చి, మంచం కోటిమీదినుంచి పాకి శివలింగాన్ని చుట్టబెట్టుకున్న విధంగా తన మెడలో ఒక మెలికతిరిగి పడగ విప్పి కాటు వేసేందుకు వాటమైన పొజిషన్‌కు మారింది....

చప్పున శంకరయ్య మేల్కొన్నాడు; మెడలో ఉన్న తాడు చూసేప్పటికే అతని హంస లేచింది. ఒక్కగావు కేకతో ఆ హంస అనంతాకాశంలోకి ఎగిరిపోయింది.

శంకరయ్య శవం వీధివైపు చూస్తోంది.

మృత్యు గహ్వరంనుంచి బైటపడి రంగారావు ఆ దారిన పోతూండటం చూసి ఆ శవం దేవపురంలోని దేవతా పాము మహిమకు ఆశ్చర్యపడినట్లుంది.

చిత్రమేమంటే అదేసమయానికి దేవపురంలోని పామును ఎవరో చంపివేశారనే వార్త కూడా వాయువేగంతో వచ్చి పడింది.

బహుశా ఆ పాము తన మహత్తునంతా వ్యయపరిచి, ఇహలోకంలోని తన పనులు పూర్తిచేసుకొని శంకరాభరణంగా ఉండేందుకు సరాసరి కైలాసానికే వెళ్ళి ఉండొచ్చు.

—ఏప్రిల్, 1964.